కథ

నర్సరీ రైంతో సెల్ రిత్విక్‌ని మేల్కొల్పింది.

కళ్ళు తెరవకుండానే. సెల్ తీసుకుని "హలో" అన్నాడు.

'రిత్విక్"

"నీ"

**"నీహారిక స్లీపింగ్ పిల్స్ ఓవర్ డోస్ వేసుకుంది. ఇప్పుడు వాళ్ళింటి దగ్గరలోనే ఉన్న విజయా నర్సింగ్‌హోంలో ఉంది. అక్కణ్ణించే మాట్లాడుతున్నాను. క్రిటికల్‌గా ఉందో ఏమో. డాక్టర్లెవరూ మాట్లాడ్డం లేదు. ఎందుకీ స్టెప్ తీసుకుందో నీకేమయినా తెలుస్తోందా!"**

ఒక్కసారిగా మత్తు దిగిపోయింది. మంచం దిగి పక్క గదిలోకి వెళ్ళాడు.

''ఏవిటి, నువ్వంటున్నది? నువ్వు దీక్షవేనా!'' కంగారుగా ఆత్రుతగా అన్నాడు.

''అవును దీక్షనే. నాకు నీహారిక మదర్ ఫోన్ చేసారు''

# భగవాన్! ఆమెను కాపాడు

''డాక్టర్లేం అన్నారు?'' భయంగా అడిగాడు.

''ఏమో! ఏమీ చెప్పలేం అంటున్నారు'' అంటూ కట్ చేసింది.

దాని తర్వాత భయంకరమైన నిశ్శబ్దం. గదిలోకె ళ్ళాడు.

భయంతో ఒళ్ళంతా చెమటలు పట్టేస్తోంది.

అయోమయంగా ఉంది మనసంతా. ఏం చెయ్యాలి? నీహారికకి ఏమైనా అయితే తనా బాధ్యుడు? తనెల్లా అవుతాడు?

డిమ్‌గా ఉన్న బెడ్ లైటు కాంతిలో మంచం వైపు చూసాడు. గుడ్డి వెలుగులో ఓ వైపునకు ఒత్తిగిలి పడుకున్న లావణ్య తెల్లటి నైటీలో నందివర్ధనం మొగ్గలా ఉంది.

టైం చూసాడు రెండున్నర. ఆమెను నిద్రలేపాలా వద్దా? ఎక్కణ్ణించి మొదలుపెట్టి ఆమెకు అర్థం అవుతుంది! లేపకూడదని నిశ్చయించుకున్నాడు. ఓసారి బట్టల వైపు చూసుకున్నాడు. వేసుకున్నది టెర్రి కాట్ పఠాన్ సూట్. మడతలు ఎక్కువగా ఏం లేదు. డ్రెస్ మార్చుకోలేదు. కారు తాళాలు, ఇంటి తాళం చెవి తీసుకుని బయటికి వచ్చాడు. తలుపు తాళం పడిందో లేదో తిరిగి ఓసారి తలుపుని చూసి, లిఫ్ట్ వైపు నడిచాడు.

నర్సింగ్‌హోంకి వెళ్ళాకా నీహారిక ఎక్కడుందో కనుక్కోడం పెద్ద కష్టం కాలేదు. ఎమర్జెన్సీ రూం దగ్గరికి వెళ్ళేప్పటికి మరో నలుగురున్నారు. నీహారిక తల్లి సుమిత్ర, చెల్లెలు తుషార, దీక్ష, ఓ పైజమా లాల్చీ వేసుకున్న పెద్దమనిషి.

నీహారిక తల్లిని చూసి తల నిలువుగా ఊపాడు. ఆమె నిశ్చలమైన కళ్ళతో, వణుకుతున్న పెదవులతో టెన్షన్‌లో ఉంది.

తుషార, ఆ పైజామా మనిషితో ఏదో సీరియస్‌గా మాట్లాడుతోంది. అతను వింటున్నంత సేపు మొహం, మెడ, నుదురు, ఓ పెద్ద రుమాలుతో తుడుచుకుంటూనే ఉన్నాడు.

రిత్విక్‌కి ఏం చేయాలో తెలీక చేతులు కట్టుకుని ఓ కుర్చీలో కూచున్నాడు. రెండు అరచేతుల్లో గడ్డం పెట్టి తలవొంచుకున్నాడు.

రిత్విక్‌కి నీహారికతో పంజాగుట్టలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నప్పుడు పరిచయం అయింది. హలో, హాయ్ పరిచయం, రెస్టారెంట్‌లు సినిమాల వరకు వెళ్ళింది. మలుపు తిరిగింది. ప్రేమంటే ఇదే అని తెలపడానికి పదహారు నెలలు పట్టింది. కానీ అది నిజమైన ప్రేమ కాదు, ఓ ఆకర్షణ మాత్రమే అని లావణ్యని చూసాకా రిత్విక్‌కి అనిపించింది.

రిత్విక్‌కి మాదాపూర్‌లోని ఓ కంపెనీలో మంచి ఉద్యోగం దొరికింది. అక్కడే లావణ్యతో పరిచయం. ఇద్దరికీ నైట్ డ్యూటీలే. ఒకే కాబ్‌లో ఇద్దరూ వెళ్ళడం, రావడం గంట ప్రయాణంలో ఎన్నో విషయాలు, ఎన్నో చర్చలు, ఎన్నో అభిప్రాయాలు. ఆమెలో ఓ గొప్ప ఆకర్షణ. ఆ అయస్కాంత శక్తికి తట్టుకోలేకపోయాడు.

చెప్పలేకుండా నీహారికతో అన్ని విషయాలు చెప్పాడు. దెబ్బతిన్నట్టు చూసింది. ఆ చూపుని ఈరోజు వరకూ మర్చిపోలేదు. కానీ తప్పదు. లావణ్యని వదులుకోడం చాలా కష్టం. ''నీ మనసు కష్టపెట్టాను. కానీ నా చేతుల్లో ఏమీ లేదు. ఆమె శక్తి ముందు నిస్సహాయుణ్ణి.''

ఆ తర్వాత దీక్ష ఎప్పుడైనా నీహారిక విషయాలు చెప్తుండేది. కానీ ఆమె ఏరోజూ కలవడానికి ప్రయత్నం చెయ్యలేదు.

సరిగ్గా పదిహేను రోజులక్రితం, లావణ్యతో పెళ్ళి జరిగిపోయింది. నీహారిక, దీక్ష పాత ఆఫీసు వాళ్ళతోపాటూ వచ్చారు. సింగపూర్ హనీమూన్‌కెళ్ళి వచ్చి రెండే రోజులయింది. ఈరోజున ఈ సంఘటన. పెళ్ళి, హనీమూన్ ఆమెలో ఓ కక్ష, కసిని పెంచాయి.

ఏమైనా అయితే... ఆ ఊహ చాలా భయంకరంగా అనిపించింది. 'నేనే బాధ్యుణ్ణి... నా వల్లనే ఇదంతా జరిగింది. అందరూ అనుకుంటే'.

భగవాన్! నీహారికని బతికించు.

మొహాన్ని తుడుచుకుంటూ లేచాడు.

జరిగిన దాన్లో ఆమె తప్పేం ఉంది? నన్ను ప్రేమించడమేనా? దానికి ఆమె ఎందుకు బలి అవాలి? ఆమె హృదయాన్ని గాయపర్చాడు. ఏడ్పించాడు. అందుకే ఆ నిరాశ, నిస్పృహ, నిస్సహాయత ఆమెని ఆత్మహత్యకి పురికొల్పాయి.

డ్క్వరు తలుపులు తెరుచుకుని బయటికొచ్చాడు. డ్క్వరు ముందు నుంచున్నాడు.

''చెయ్యాల్సింది చేస్తున్నాం. వియ్ కెన్ వోన్లీ హోప్''

వెనక్కొచ్చి దీక్ష పక్కగా నుంచున్నాడు.

నీళ్లు నిండిన కళ్లతో రిత్విక్‌ని చూసి తల దించుకుంది దీక్ష.

''నా మూలంగానే... '' అంది మెల్లగా.

ఆశ్చర్యంగా చూశాడు.

దీక్ష, నీహారిక బెస్ట్ ఫ్రెండ్.

''నువ్వు లావణ్యని ప్రేమిస్తున్నావని అన్నప్పుడు హిస్టీరిక్‌గా బిహేవ్ చేస్తూంటే నేనే ఓదార్చాను. నువ్వు చేసింది ఏం బాగాలేదు. నేను ఓ కర్రలాగా సాయంగా ఉన్నాను కాబట్టి సరిపోయింది. లేకపోతేనా...'' అంటూ ఆరోజున అన్న దీక్ష ఈమె ఒకరేనా?

''ఏం జరిగింది?''

''నిన్న సాయంత్రం హాస్టల్‌కి ఫోన్ చేసింది, అర్జంటుగా కలవాలని. అప్పుడంత తెలీలేదు కానీ ఇప్పుడనిపిస్తోంది, ఆ గొంతులో చాలా నిరాశ ఉందని''

''కలిశావా?''

''ఆఫీసుకెళ్ళిపోతున్నాను. పొద్దున్న ఆరు గంటలకి మీ ఇంటికొస్తాను. బ్రేక్‌ఫాస్ట్ మీ ఇంట్లోనే చేస్తాను. అప్పుడు మాట్లాడుకుందాం అని అన్నాను. సరే అని ఫోన్ పెట్టేసింది. పదకొండు గంటలకి నీహారిక వాళ్ల మదర్ దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది, నీహారిక స్లీపింగ్ పిల్స్ వేసుకుందని. అప్పుడు నా ప్రాజెక్ట్‌లో

పార్ట్నర్ సందీప్. ఇంటి దగ్గర నన్ను దింపాడు. అప్పుడు నేనూ ఆంటీ కలిసి ఈ నర్సింగ్ హోమ్‌లో చేర్పించాము''

''ఏం జరిగి ఉంటుంది?'' ఆలోచిస్తున్నట్టుగా అన్నాడు.

''నాకు అదే అర్థం కావడంలేదు. పాపం నా మీద ఎంతో నమ్మకం ఉండేది. నేను నిలబెట్టుకోలేకపోయాను. నేను చాలా సెల్ఫిష్. మళ్లీ ఓసారి ఫోన్ చేసి మాట్లాడాల్సింది. ఏం తోచలేదు. ఈ ప్రాజెక్ట్ అయ్యాకా ఆస్ట్రేలియా ట్రిప్ ఉంది కాబట్టి ప్రాజెక్ట్ మీదే కాన్‌సంట్రేట్ చేశాను. జీవితం కన్నా ఇవన్నీ ముఖ్యమా? ఈ ఫిలాసఫీ ఎందుకు అర్థం అవలేదు. నాకు ఏదో చెప్తామనిపించింది. ఏదో జరిగి ఉంటుంది నేను ఏమాత్రం ఆమెకు హెల్ప్ చెయ్యలేదు. దేవుడు నన్ను క్షమించడు'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది.

ఆమె భుజం మీద చెయ్యి వేసి నొక్కాడు రిత్విక్.

ఒక్కసారి గట్టిగా కళ్లు మూసుకుంది.

దేవుడా! ఆమెను కాపాడు. నా మూలంగా ఆమె చచ్చిపోకూడదు.

సుమిత్ర వాళ్లిద్దర్నీ చూస్తూ తన కళ్లు తుడుచుకుంది.

నీహారిక... ఇంత దారుణమైన అడుగు ఎందుకేసింది? నేనన్న మాట మూలం గానా! అందుకే అయితే నేను చాలా దుర్మార్గురాల్ని. చాలా సెన్సిటివ్ అయిన నా కూతురి గురించి తెలిసి కూడా నేనంత మాట ఎలా అనగలిగాను? వారం రోజుల కిందట జరిగినది కళ్ల ముందు మెదిలింది.

రిత్విక్ లావణ్యని ప్రేమిస్తున్నప్పటి నుంచీ నీహారిక డిప్రెస్ అయింది. నీహారిక తుషార చాలా చిన్నగా ఉన్నప్పుడే తండ్రి వేరే పెళ్లి చేసుకుని వెళ్లిపోయాడు. వారానికోసారి, తండ్రిని కలవడం, ఏదో హోటల్‌కెళ్లడం, డ్యూటీలాగా ఉండే ప్రవర్తన, రాన్రాను ఆ సంబంధాన్ని, బంధాన్ని పెంచుకోలేదు. దానికి తగ్గట్టుగా చదువులు, పార్ట్ టైం ఉద్యోగాలు. కూతురు చదివిన చదువుకి మంచి ఉద్యోగం వస్తుందని సుమిత్రకి తెలుసు. మంచి ఉద్యోగం జీతం. దీక్ష ఫ్రెండ్‌షిప్. తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది, నీహారికలోని మార్పు చూసి.

ఈ ఉద్యోగం వదిలేసి, రిత్విక్ మాదాపూర్‌లో చేరాకా నీహారికలో మార్పు గమనించింది. దీక్షని కనుక్కుంటేనే తెలిసింది రిత్విక్ విషయం. కూతురి మీద జాలి వేసింది. ఓ ఫ్రెండ్‌లా అన్నీ అడిగి తెలుసుకుంది. అయినా మనిషి మామూలుగా ఉండలేకపోయింది.



ఉద్యోగం మారింది. రంజిత్‌తో పరిచయం. కోఆర్డినేటర్‌గా హెల్ప్ చెయ్యడం. రంజిత్ తెలుగులో మాట్లాడే తప్పులు, అతని హడావుడి, చెప్తూంటే మనిషి మామూలుగా అవుతున్నట్టుగా అనిపించింది.

నీహారిక అంటే- శ్రద్ధ చూపిస్తున్నట్టుగా అనిపించింది. ఏదైనా పార్టీ అయినా వీకెండ్‌లో వెళ్లే పిక్నిక్‌లకి వెళ్లేటప్పుడు ఇంటికి వచ్చి, కారులో తీసుకెళ్లి, తీసుకొచ్చేవాడు.

సరిగ్గా నాలుగు రోజుల క్రితం... రంజిత్ గురించి వివరాలు కనుక్కుంది. తల్లి తండ్రి కాలేజీలో పనిచేస్తున్నారు. చెల్లెలు ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. మంచి మాచ్. జోడి బావుంటుంది. ఆ రాత్రి భోజనం చేస్తున్నప్పుడు అడిగింది-

''రంజిత్‌కి పెళ్లయిందా?''

''లేదు''

''మీ ఫ్రెండ్‌షిప్ ఎలాటిదనిపిస్తోంది?''

''అంటే'' ముఖం చిట్లించి అంది.

''మీకు పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉందా?''

''మమ్మీ! ఏం మాట్లాడుతున్నావ్? నాకన్నా ఏడాది చిన్న రంజిత్. అయినా నువ్వు కూడానా... ఇంత చీప్‌గా ఆలోచించావా?''

అప్పట్నించి చాలా ముభావంగా ఉంటోంది. మధ్యలో ఓరోజు దీక్ష రూంలో ఉంది.

సుమిత్రకి చాలా సిగ్గుగా అనిపించింది కూతురి కిష్టం లేని ఊహ కలిగినందుకు. తనమీద తనకే ఎలాగో అనిపించింది.

ఓరోజు దీక్షని తీసుకుని ఇంటికొచ్చింది. గదిలో తలుపులు వేసుకుని పాటలు పెట్టుకుంటూ ఉండిపోయారు. మధ్య మధ్యలో మామూలుగా ఉన్నా తనే దూరంగా వాళ్లలో ఇదివరకులా వెళ్లలేకపోయింది. తప్పు చేసినట్టు గదిలో కంప్యూటర్ ముందు కూచుండిపోయింది.

కానీ నీహారిక మనసులో తనన్న మాటలు ఇంకా ఇంకా ప్రభావితం చేసి ఆఖరికి ఆత్మహత్య వరకు దారి తీసిందా? తనంత ఘోరమైన మాట అందా? నీహారికకేనైనా అయితే అందరూ తనని ఓ క్రిమినల్‌గా చూడరా! ఇంత బ్రతుకూ బ్రతికీ... ఇలాగే ఉంటుంది సింగిల్ పేరెంట్ రెస్పాన్సిబులిటీస్ అన్న మాటలు ఎన్ని వినాల్సి వస్తుందో! దేవుడా! దాన్ని

**గంటి భానుమతి**

బ్రతికించు. చిన్నపిల్ల. జీవితం అంతా ముందుంది. తప్పంతా నాదే. నా పెంపకంలోనే ఏదో లోపం ఉండి ఉంటుంది. అందుకే ఇలా జరిగింది. ఇక ముందు నా వల్ల ఏ లోటూ, లోపం రానీకుండా చూసుకుంటాను. భగవాన్! ఆమెని బతికించు.

అనిల్ భాయ్ షా దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉండిపోయాడు. చెమట తల్లోంచి చెవుల పక్క నుంచి ధారగా కారిపోయింది. తుడుచుకుంటూ గాభరాగా ఉన్న మనసుని అదుపులో ఉంచుకోడానికి, కళ్లు మూసుకున్నాడు.

నా మూలంగానే... ఇదంతా... నిన్న నేను ఆ పింక్ స్లిప్ ఇవ్వకుండా ఉంటే ఈ పరిస్థితి నీహారికకి వచ్చి వుండేదా? కానీ తనేం చెయ్యగలడు? పూర్తి ఐటి ఇండస్ట్రీనే అలా ఉంది. మాన్‌పవర్ కట్ చెయ్యాలన్నారు. ఎంతోమందిని తీసేయాల్సి వచ్చింది, తప్పలేదు. కాంట్రాక్ట్‌లు లేవు. ఒకళ్ల తర్వాత ఒకళ్లని తీసేస్తున్నాడు. నీహారిక బాగా పనిచేస్తుంది. నో డౌట్! కానీ తను హెల్ప్‌లెస్. అందుకని ఇంత భయంకరమైన స్టెప్ తీసుకుందా?

వెళ్లిపోయే ముందు కూడా ఏమీ అనలేదు. ఏమీ అడగలేదు. అవును. బిజినెస్‌లో ఇమోషన్స్‌కి చోటెక్కడా? రేపు ఏదైనా అయితే అందరూ తనని వేలెత్తి చూపిస్తూ వెనకాల చెవులు కొరుక్కుంటారు. తను బాధ్యుడవుతాడా?

ఎలాగా? దేవుడా! ఆమెను బతికించు.

ఎలాగైనా బతికించు.

గొంతు తడారిపోతోంది.

టైము చూశాడు.

మూడున్నర దాటింది.

పోలీస్ కేస్ అవుతుందా?

నర్స్ బయటికొచ్చింది.

అందరూ ఆశగా ఆమెను చూస్తూ రెండడుగులు ముందుకేశారు.

''ఏం భయం లేదు. ప్రమాదం లేదు. ప్రాణానికేం భయం లేదు'' అందరూ లోపలికెళ్లారు.

పూర్తిగా తెలివి రాలేదు.

అయినా ఆ మత్తులోనే కళ్లు అర తెరిచి అందర్నీ చూస్తూ నీరసంగా పెదవులు కదిలీ కదలనట్టు నవ్వింది.

అందరూ రిలీఫ్‌గా ఫీలయ్యారు. పెద్ద బరువు మోసిన అందరి గుండెలు తేలికపడ్డాయి.

ఓ ఐదు నిమిషాలు అయ్యాకా అందరూ వర్తమానంలోకి వచ్చారు.

రిత్విక్‌కి భార్యకి చెప్పకుండా వచ్చావని అనిపించింది.

అనిల్ షాకి ఒక్కసారి తన ఆఫీసూ, కాంట్రాక్ట్‌లూ, తీసెయ్యాల్సిన వాళ్ల లిస్టు కళ్ల ముందు రీల్‌గా కదిలిపోయింది.

వాళ్లిద్దరూ వెళ్లిపోయాకా, అక్కడే జోగుతూ ఉండిపోయారు మిగిలిన వాళ్లు.

మర్నాడు పొద్దున్న పదకొండు తర్వాత పూర్తిగా తెలివొచ్చింది.

''ఏవిటీ, ఎక్కడున్నాను?'' అంది నీరసంగా.

''స్వర్గం'' అంటూ ఆమె పక్కన కూర్చుంది దీక్ష.

ఆశ్చర్యంగా, అర్థం అవనట్టు, ప్రశ్నార్థకంగా ఆమెను చూస్తోంది నీహారిక.

సుమిత్ర మంచం మీద కాళ్ల దగ్గర కూర్చుని కూతురి ముఖంలోకి చూస్తోంది.

''ఎందుకిలా చేసావ్?'' దీనంగా అడిగింది సుమిత్ర.

''ఏవిటీ?''

''ఏం జరిగింది చెప్పు! ఇంత డ్రాస్టిక్ స్టెప్ ఎందుకు తీసుకున్నావ్?''

''అంటే... నేనేం చేసాను? అసలేమయింది?'' ఆశ్చర్యంగా చూసింది.

సుమిత్ర, దీక్ష అయోమయంగా ఆమెనే చూస్తూండిపోయారు.



''స్లీపింగ్ పిల్స్ ఎందుకు తీసుకున్నావ్?'' లాలనగా అడిగింది.

''స్లీపింగ్ పిల్స్?'' కళ్లు చిన్నగా చేస్తూ తలపైకెత్తింది.

''ఆ... ఆ... ఎందుకు?''

మెల్లిగా పైకి జరిగి దిండుని వీపుకి ఆనించుకుంది.

''ఏం జరిగింది... నిన్న...'' ఆగింది.

''మామూలుగా నాలుగ్గంటలకి ఆఫీసుకెళ్లాను. ఉద్యోగం పోయిందన్న విషయం వెంటనే తెలిసిపోయింది. వెంటనే అమీర్‌పేట ప్రియా ప్లేస్‌మెంట్స్ లోకెళ్లాను.

అక్కడినుంచీ బేగంపేట ప్రదీప్ దగ్గరికెళ్లాను, ఏవైనా చూస్తాడేమోనని. విరల్‌కి తెలిసిన వాళ్లెవరికో పర్సనల్ కావాలని తెల్సింది. ఆ అడ్రస్ నీ దగ్గరుంది కదా అని నీకు ఫోన్ చేసాను. పొద్దున్న వస్తావన్నావు కదా అని, అక్కడే కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న మినతి దగ్గరికెళ్లాను. ఫాక్టరీ ఇష్టం అయితే వెళ్లమని దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్ డిపో దగ్గరున్న ఓ కాలేజ్ అడ్రస్ ఇచ్చింది...''

''దిల్‌సుఖ్‌నగర్ వెళ్లి రెస్యూం ఇచ్చి, ఇంటికొచ్చేటప్పటికి ఏడున్నర దాటింది. దాదాపు ఐదు గంటలు కంటిన్యుయస్‌గా బయట తిరగడం వల్ల విపరీతమైన తలనొప్పి, కడుపులో తిప్పడం. నాకు ఏస్ప్రోలు, క్రోసిన్‌లు వేసుకుంటే కడుపులో మంట, గుండెల్లో మంట వస్తుంది కదా, హోమియోపతిక్ పిల్స్ తలనొప్పి కోసంవి ఉన్నాయి. మంచం పక్కనే ఉన్న సైడ్ టేబిల్ సొరుగులోని బాటిల్‌లోని మాత్రలు వేసుకున్నాను. అది... మరి... అయితే''

''అవి హోమియోపతిక్ పిల్స్ కావు'' అంది సుమిత్ర.

''అయితే నేను వేసుకున్నది...'' సగంలో ఆగింది.

''పిచ్చి పిల్లా! అవి నా నిద్రమాత్రలు. లేబిల్ చూడకుండా ఎలా వేసుకున్నావు?'' అంటూ కాళ్ల మీద ఓ దెబ్బ చిన్నగా వేసింది.

''నీ కూతుర్ని మమ్మీ! డాడీతో విడిపోయినా, జీవితం అయిపోలేదు అన్న ధైర్యం నీ శ్వాస. అదే ఊపిరి నేను కూడా పీలుస్తున్నాను.

డిప్రెస్డ్ బట్ నాట్ డిఫీటెడ్. ఛాలెంజ్, ఛేంజ్ లేనిది జీవితమా! ఆశా జీవిని. మంచే జరుగుతుంది.

పాజిటివ్ థింకింగ్ నీ దగ్గర్నుంచి నేను నేర్చుకుంటున్నాను''

దీక్ష, సుమిత్ర నీళ్లు నిండిన కళ్లతో మసకబారిన చూపుని క్లియర్ చేసుకుని ఆమెను చూస్తూండిపోయారు.

♣

## అదృష్టం

**హ్యాట్రిక్ హీరో రవితేజ సరసన 'ఇడియట్'లో నటించిన రక్షిత ఎడాపెడా ఛాన్స్‌లు కొట్టేసింది. ఆమె నటించిన తొలి చిత్రం హిట్ కావడంతో ఆమెకి తిరుగే లేకుండా పోయింది. ఆమె ఉంటే సినిమా హిట్టవుతుందని ఇప్పుడు సినీ జనాలంతా ఎంతో నమ్మకంతో ఉన్నారు. ఆమె కాల్షీట్ల కోసం కన్నడ, తమిళ నిర్మాతలు ఎదురుచూస్తున్నారు. యువదర్శకుడు తేజ కొత్త చిత్రం 'నిజం'లో ఆమె నటిస్తోంది. దీంతో పాటు బాలకృష్ణ సరసన నటించే అవకాశాన్ని కూడా ఆమె చేజిక్కించుకుంది. ఏమైనా ఒక్క చిత్రంతోనే టాలీవుడ్‌లో ప్రత్యేకస్థానాన్ని పొందిన రక్షితని చూసి తోటీ హీరోయిన్లు ఈర్ష్యతో ఉన్నారు.**